క్లుప్తంగా

ఈర్లగంగమ్మకు ప్రత్యేక పూజలు

బల్లికురవ: మార్గశిరమాసం పౌర్ణమి ఆదివారం సందర్భంగా బల్లికురవ సమీపంలోని ఈర్లగంగమ్మకు ప్రత్యేక పూజలు చేపట్టారు. బల్లికురవ, కొత్తపాలెం, నక్కబొక్కలపాడు, కొత్తమల్లాయపాలెం, పాతమల్లాయపాలెం, కొండాయపాలెం, చెన్నుపల్లి గ్రామాల్లోని భక్తులు భారీగా తరలివచ్చారు. అమ్మవారికి మొక్కులు చెల్లించుకున్నారు. వేడుకల్లో భాగంగా అమ్మవార్లకు ప్రత్యేకంగా అలంకరించారు. గ్రామాల్లోని గ్రామ దేవతలకు విశిష్ట పూజలతో ప్రత్యేకంగా అలంకరించారు.

ఘనంగా లక్ష తమలపాకుల పూజ



అద్దంకి రూరల్: ప్రముఖ పుణ్యక్షేత్రమైన శింగరకొండ ప్రసన్నాంజనేయ స్వామికి మార్గశిర శుద్ధపౌర్ణమి మృగశిర నక్షత్రం సందర్భంగా ఆదివారం లక్ష తమలపాకులతో పూజ నిర్వహించారు. దీనిలో ప్రాతః కాలం సుప్రభాతం, బిందెతీర్థం, గోపూజ అనంతరం స్వామివారికి అభిషేక కార్యక్రమం అలంకరణ నిర్వహించారు. వేదపండితులు, ఉభయదాతలు మంగళవాయిద్యాలతో ఆలయ ప్రదక్షిణ చేశారు. వినాయకస్వామి, సుబ్రమణ్యస్వామి వారికి జీవధ్వజ ఉత్సవాహనానికి నారికేళ ఫల సమర్పణ అనంతరం 11 ఆవృత్తాలుగా దేవస్థాన వేదపండితులు, అర్చకులు లక్ష తమల పాకులతో పూజా కార్యక్రమం నిర్వహించారు. తీర్థప్రసాదాలు అందజేశారు.

భక్తిశ్రద్ధలతో దత్త జయంతి



వేటపాలెంలో ప్రత్యేక అలంకరణలో దత్తాత్రేయ స్వామి మూలవిరాట్

వేటపాలెం: కొత్తపాలెం రోడ్డులోని దత్తక్షేత్రంలో దత్తజయంతి వేడుకలు ఆదివారం వైభవంగా నిర్వహించారు. ఈ సందర్భంగా స్వామివారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. పంచామృతాలతో స్వామి వారికి అభిషేకాలు చేశారు. స్వామి వారికి సువర్ణ, రజిత ఆభరణాలతో అలంకరించారు. ఆలయ ప్రాంగణంలో దత్తహోమం నిర్వహించారు. గురుచరితం, సాయి చరితం పుస్తకాలను భక్తులకు పంపిణీ చేశారు. అధిక సంఖ్యలో భక్తులు బారులు తీరి స్వామి వారిని దర్శించుకొన్నారు. ఆలయ కమిటీ సభ్యులు భక్తులకు అన్నసంతర్పణ గావించారు. ఆలయ కన్వీనర్ కరణం ప్రమీల దేవి, అధ్యక్షుడు ప్రత్తి వెంకట సుబ్బారావు, కార్యదర్శి నున్నా శివప్రసాదరావు, కోశాధికారి కరణం మురళీ కృష్ణ పాల్గొన్నారు.

ఘనంగా కాశినాయన ఆరాధనోత్సవం

పెద్దారవీడు: మండల పరిధిలో దేవరాజుగట్టు సమీపంలో వెలసిన కాశినాయన ఆశ్రమంలో 29వ ఆరాధనోత్సవాన్ని ఆదివారం భక్తిశ్రద్ధలతో పూజలు నిర్వహించారు. అర్చకులు బీవీ దత్తయ్య ఆధ్వర్యంలో కాశినాయనస్వామికి సుప్రభాతసేవ, నవగ్రహ మండపారాధన, కలశ, పంచామృతం, మంత్రపుష్పం, తదితర పూజలు చేసిన అనంతరం పట్టువస్త్రాలు, పూలమాలతో ప్రత్యేకంగా అలంకరించారు. ఆశ్రమంలో ఉప ఆలయాలు అన్నపూర్ణ సమేత కాశీవిశ్వేశ్వరస్వామి, ఆంజనేయస్వామి, నవగ్రహాలు, నాగమయ్య స్వాములు, గోపికా సమేత రాధాకృష్ణుల భక్తులు పూజలు నిర్వహించారు. వెంకటేశ్వర భక్త మండలిచే భక్తి భజన కార్యక్రమం, మధ్యాహ్నం పెద్దనాగులవరం బాల బాలికలచే భక్తి పాటలతో హనుమాన్ కోలాట బృందం ప్రదర్శన, కోడి శ్రీరామ్మూర్తి ఆరోగ్య క్రీడాభివృద్ధి సంస్థ వారిచే కర్రసాము, సాయంత్రం మార్కాపురం వారిచే భక్తి పాటలతో బంగారమ్మ తల్లి కోలాట బృందం ప్రదర్శన, రాత్రి సత్యహరిశ్చంద్ర పూర్తి నాటకం ప్రదర్శన చేశారు. భక్తుల సంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి. భక్తుల కోసం మధ్యాహ్నం నుంచి రాత్రి సమయం వరకు అన్నసంతర్పణ కొనసాగించారు.

నిత్యం ప్రమాదాలు.. ఆగని మరణాలు

- ప్రమాదాలకు నిలయంగా అద్దంకి–నార్కెట్‌పల్లి రహదారి
- రోజురోజుకూ పెరుగుతున్న మృతులు, క్షతగాత్రుల సంఖ్య
- ట్రాఫిక్ వ్యవస్థ లేక ఇబ్బందులు
- బైపాస్ నిర్మాణంతోనే ట్రాఫిక్ సమస్యకు చెక్



అద్దంకిలో ట్రాఫిక్ ఇలా..

అద్దంకి: నియోజకవర్గ కేంద్రం అద్దంకిలో రోజురోజుకూ జనాభా పెరిగిపోతోంది. చుట్టు పక్కల నుంచి వివిధ పనులు, వ్యాపారాలు, ప్రయాణాలు సాగించే వేలాదిమందితో పట్టణంలో ట్రాఫిక్ కూడా అంతకంతకూ పెరిగిపోతోంది. పైగా వేలాది వాహనాల రాకపోకలు సాగిస్తుంటాయి. పట్టణంలో నుంచే అద్దంకి–నార్కెట్‌పల్లి రాష్ట్రీయ రహదారి వెళుతుంది. దీంతో వాహనాలు.. ప్రజలతో కిట కిటలాడుతున్న రహదారిలో ఎక్కడో ఓ చోట నిత్యం ప్రమాదం జరుగుతూనే ఉంది. ముఖ్యంగా బస్టాండ్ సెంటర్, భవానీ సెంటర్, వ్యవసాయ మార్కెట్ యార్డు సెంటర్‌తో పాటు పలు బ్లాక్ స్పాట్‌లున్నాయి. సంవత్సరం మొత్తం మీద 200 పైగా ప్రమాదాలు జరిగాయి. పదుల సంఖ్యలో మృత్యువాత పడ్డారు. వేలమూరిపాడు డొంక నుంచి విద్యుత్ సబ్‌స్టేషన్ వరకూ అద్దంకి నార్కెట్‌పల్లి రాష్ట్రీయ రహదారి నిత్యం వేలాది వాహనాల రాకపోకలతో రద్దీగా ఉంటుంది. ఈ క్రమంలో స్థానిక ప్రజల వాహనాలు, ఇతర రాష్ట్రాల నుంచి వస్తున్న వాహనాలతో ట్రాఫిక్ మరింత ఎక్కువవుతోంది.

కట్టడి చేయకుంటే ఎలా?

పట్టణంలో సుమారు 45 వేల జనాభా ఉంది. నియోజకవర్గ కేంద్రం కావడంతో నిత్యం ట్రాఫిక్ అధికంగా ఉంటుంది. ఈ క్రమంలో ముఖ్యమైన ప్రదేశాలైన భవానీ సెంటర్, వ్యవసాయ మార్కెట్ యార్డు, అంబేడ్కర్ విగ్రహ ప్రాంతం, బస్టాండ్ ఎదురు ప్రాంతాల్లో ట్రాఫిక్ సిగ్నల్ వ్యవస్థను ఏర్పాటు చేస్తే ప్రమాదాలు తగ్గే అవకాశం ఉంది. పట్టణంలోని ఎన్నెస్పీ కాలువ రామనగర్ నుంచి అద్దంకి రేణింగవరం రహదారిలో కలుస్తుంది. ఈ కట్టను మినీ బైపాస్‌గా మార్చి నేరుగా వెళ్లే వాహనాలను అటు వైపు నుంచి పంపితే ట్రాఫిక్ సమస్య తగ్గడంతోపాటు ప్రమాదాలు తగ్గే అవకాశం ఉంది. స్థానిక పోలీసులకు ఉన్న డ్యూటీలు, నేరాలను అరికట్టే పనే సరిపోతోంది. దానికితోడు ట్రాఫిక్ సమస్యతో పోలీసులు సతమతం అవుతున్నారు. ఈ క్రమంలో కనీసం సిగ్నల్ వ్యవస్థతో పాటు ట్రాఫిక్ పోలీసు వ్యవస్థను ఏర్పాటు చేయాలని పట్టణ ప్రజలు కోరుతున్నారు.

ఈ విషయమై సీఐ కృష్ణయ్యను వివరణ కోరగా ఇప్పటికే డీఎస్పీ సూచనల మేరకు ముగ్గురు ట్రాఫిక్ కంట్రోల్ కోసం పోలీసులను డ్రెస్‌తో కేటాయించామన్నారు. అలాగే ఒక దాత సాయంతో కొద్ది రోజుల్లో సిగ్నల్ వ్యవస్థను కూడా ఏర్పాటు చేయడానికి చర్యలు తీసుకుంటున్నామని చెప్పారు.

పొట్టి శ్రీరాములు ఆశయాలు కొనసాగిద్దాం



పర్చూరు: పొట్టి శ్రీరాములుకు నివాళులర్పిస్తున్న ఆర్యవైశ్య సంఘం నాయకులు



చినగంజాం: పొట్టి శ్రీరాములుకు నివాళులర్పిస్తున్న ఉపాధ్యాయులు, విద్యార్థినులు

వేటపాలెం: అమరజీవి పొట్టి శ్రీరాముల ఆశయాలను కొనసాగిద్దామని ఎస్సై ఎం. వెంకటేశ్వర్లు పేర్కొన్నారు. ఆదివారం రైల్వేస్టేషన్ రోడ్డులో యూనియన్ బ్యాంక్ దగ్గరలో గల పొట్టి శ్రీరాములు విగ్రహానికి 72 వర్ధంతి పురస్కరించుకొని మండల వాసవి ఫ్రెండ్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో పూల మాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా వాసవీ ఫ్రెండ్స్ నాయకులు మాట్లాడుతూ శ్రీరాములు తెలుగు భాషా రాష్ట్రాల అవతర కోసం ఆమరణ నిరాహర దీక్ష చేపట్టి తన ప్రాణాలు పోగొట్టుకొన్న మహా వ్యక్తి అని కొనియాడారు. దేశానికి అందించిన పోరాటయోధుడు శ్రీరాములు జీవితం విద్యార్థులుకు పాఠ్యాంశంగా చేర్చాలని కోరారు. అనంతరం పేదలకు అన్నదానం చేశారు. అసోసియేషన్ నాయకులు దొగుపర్తి బాలకృష్ణ, గట్టా రమేష్, శ్రీరాం గోవర్ధన్, తేజ, సుమన్, పోన్నూరి రమేష్, కోటి స్వామి గుప్తా, చుండూరి గాయత్రి, తిరువీధులు ఉమామహేశ్వరరావు, కోడూరి రామలింగేశ్వరరావు శ్రీరాం బాలాజీ కృష్ణ తేజ, పేర్ల సుమన్, దివాకర్, గుగ్గిలం శ్రీహరి, అమరా సునీత పాల్గొన్నారు.

ఇంకొల్లు (చినగంజాం): తహసీల్దార్ కార్యాలయంలో పొట్టి శ్రీరాములు ఆత్మార్పణ దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. తహసీల్దార్ వెంకట రత్నం పొట్టి శ్రీరాములు చిత్రపటానికి పూల మాల వేసి ఘనంగా నివాళులర్పించారు. రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు.

పర్చూరు (చినగంజాం): అమరజీవి పొట్టి శ్రీరాములు 72వ ఆత్మార్పణ దినోత్సవం పురస్కరించుకొని పర్చూరులో అభిమానులు ఘనంగా కార్యక్రమాన్ని నిర్వహించారు. రాష్ట్ర ఆర్యవైశ్య సంఘం ఉపాధ్యక్షుడు మామిడిపాక హరిప్రసాద్ ఆధ్వర్యంలో ఆదివారం కొట్ల బజారులోని పొట్టి శ్రీరాములు విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ పొట్టి శ్రీరాములు వర్ధంతిని రాష్ట్ర ప్రభుత్వం పొట్టి శ్రీరాములు ఆత్మార్పణ దినోత్సవంగా తీర్మానించి గెజిట్ విడుదల చేయాలని డిమాండ్ చేశారు. మహనీయులు తీసుకొచ్చిన రాష్ట్రాన్ని దేశంలోనే ఆదర్శవంతమైన రాష్ట్రంగా నిలపాలని కోరారు. అనంతరం విద్యార్థులకు ఉచితంగా రాత పుస్తకాలను అందించారు. కార్యక్రమంలో ఆర్యవైశ్య సంఘం నాయకులు ఎస్. వెంకట సుబ్బారావు, పి. వెంకటేశ్వరరావు, పూర్ణ, సిద్దయ్య, శ్రీనివాసరావు, శ్రీనివాసరెడ్డి పాల్గొన్నారు.

కారంచేడు: రాష్ట్రంలో, దేశంలో ఎంతో మంది మహనీయులు తాము చేసిన పోరాటాలు, త్యాగాలతో ఎన్నో సాధించుకోగలిగామని ఆర్యవైశ్య సంఘం మండల అధ్యక్షుడు కొత్తమాసు నాగేశ్వరరావు, ఉపాధ్యక్షుడు నల్లమల్లి రామకృష్ణ అన్నారు. ఆదివారం మండలంలోని స్వర్ణ గ్రామంలోని పొట్టి శ్రీరాములు విగ్రహం వద్ద నివాళులర్పించారు. అనంతరం వారు మాట్లాడుతూ తెలుగు వారి ప్రతిష్ట కోసం ప్రాణత్యాగం చేసిన మహనీయులను స్మరించుకోవడం ఎంతో శుభ పరిణామమన్నారు. ఆర్య, వైశ్య సంఘం నాయకులు శీరాం సుబ్బారావు, పోలిశెట్టి శ్రీనివాసరావు, నాయకులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

అద్దంకి రూరల్: తెలుగువారికి ప్రత్యేక రాష్ట్రంలో కోసం ప్రాణ త్యాగం చేసిన అమరజీవి పొట్టి శ్రీరాములకు ఆత్మార్పణ దినోత్సవం సందర్భంగా ఆదివారం అద్దంకి మండల ఆర్యవైశ్య సంఘం ఆధ్వర్యంలో పొట్టి శ్రీరాములు విగ్రహానికి పూల మాలలు వేసి నివాళులర్పించారు. అద్దంకి మండల ఆర్యవైశ్య సంఘం అధ్యక్షుడు కరపాటి రామకోటేశ్వరరావు, ఉడత్తు సురేష్, కురిచేటి ప్రసాద్, పొట్టి శివ, జవ్వాజి నాగమల్లేశ్వరరావు, సంఘనాయకులు పాల్గొన్నారు.

సంతమాగులూరు గ్రంథాలయంలో..

సంతమాగులూరు శాఖ గ్రంథాలయంలో ఆదివారం చదవటం మాకిష్టం కార్యక్రమంలో భాగంగా లైబ్రేరియన్ బాదం విజయభాస్కరరెడ్డి ఆధ్వర్యంలో పొట్టి శ్రీరాములు, వల్లభాయిపటేల్ చిత్రపటాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు.

సంతమాగులూరులో..

సంతమాగులూరు తహసీల్దార్ కార్యాలయంలో పొట్టిశ్రీరాములు ఆత్మార్పాణ దినోత్సవం సందర్భంగా పొట్టి శ్రీరాములు విగ్రహానికి పూలమాలలు వేసి నివాలులర్పించారు. కార్యక్రమంలో తహసీల్దార్, సిబ్బంది పాల్గొన్నారు.

చినగంజాం: రాష్ట్ర సాధన కోసం ప్రాణత్యాగం చేసిన పొట్టి శ్రీరాములును స్మరించుకోవాల్సిన అవసరం ఉందని జనవిజ్ఞాన వేదిక మండల అధ్యక్షుడు ఎస్. నరసింహారావు అన్నారు. స్థానిక శాఖ గ్రంథాలయంలో ఆదివారం పొట్టి శ్రీరాములు వర్ధంతిని గ్రంథపాలకుడు అళహరి మోహన లక్ష్మీనరసింహాచార్యులు ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. మహనీయుని చిత్రపటానికి పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు. ఆర్పీపాలెం ఇంగ్లిషు ఉపాధ్యాయుడు ఆర్ఎస్‌వీ పోతురాజు, ఉపాధ్యాయులు వై రామాంజనేయులు, బాలికలు పాల్గొన్నారు.

చీరాల అర్బన్: స్థానిక కామధేను కాంప్లెక్సు వద్ద ఉన్న అమరజీవి పొట్టి శ్రీరాములు విగ్రహానికి టెక్స్‌టైల్స్ మర్చంట్స్ అసోసియేషన్ అధ్యక్షుడు వేముల చంద్రశేఖర్, కమిటీ సభ్యులు శీరాం వేణు గోపాల్ తదితరులు పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఆయన త్యాగాలు మరవకూడదన్నారు.



వేటపాలెంలో నివాళులర్పిస్తున్న ఎస్సై వెంకటేశ్వర్లు, నాయకులు



పొట్టి శ్రీరాములు విగ్రహానికి పూలమాలలు వేస్తున్న అద్దంకి మండల ఆర్యవైశ్య సంఘం నాయకులు



ఇంకొల్లులో నివాళులర్పిస్తున్న సిబ్బంది



సంతమాగులూరులో పూలమాలలు వేస్తున్న తహసీల్దార్, సిబ్బంది



స్వర్ణ గ్రామంలో నివాళులర్పిస్తున్న ఆర్యవైశ్య సంఘం ప్రతినిధులు

నేరాల నియంత్రణకు చర్యలు



చినగంజాం పోలీస్ స్టేషన్‌లో రికార్డులను పరిశీలిస్తున్న డీఎస్పీ సయ్యద్ మొయిన్

చినగంజాం: విజన్ పరిధిలో నేరాలను నియంత్రించేందుకు పకడ్బందీగా చర్యలు తీసుకోనున్నట్లు చీరాల డీఎస్పీ సయ్యద్ మొయిన్ అన్నారు. పోలీస్ స్టేషన్ వార్షిక తనిఖీలో భాగంగా చినగంజాం పోలీస్ స్టేషన్‌ను ఆదివారం ఆయన సందర్శించి తనిఖీ చేశారు. పోలీస్ స్టేషన్‌లో ముందుగా సిబ్బంది పనితీరు, ప్రవర్తన తీరు, స్టేషన్ ఆవరణ, రికార్డు గదులు, నేరస్తులు ఉండే గదులను, కంప్యూటర్, రికార్డు గదులను, స్టేషన్‌లోని రికార్డులను పరిశీలించారు. అనంతరం ఆయన స్థానిక విలేకరులతో మాట్లాడుతూ వార్షిక తనిఖీలో భాగంగా చినగంజాం పోలీస్ స్టేషన్ సందర్శించినట్లు తెలిపారు. స్టేషన్‌లోని రికార్డులను పరిశీలించి స్టేషన్‌లో పరిష్కారం కాకుండా పెండింగ్‌లో ఉన్న కేసులను గుర్తించి వాటి పరిష్కారానికి తీసుకోవాల్సిన చర్యలు గురించి సిబ్బందికి వివరించామన్నారు. వ్యవసాయాధారిత ప్రాంతం కాబట్టి.. ఎక్కువగా రైతులకు సంబంధించిన సమస్యలు ఎక్కువగా నమోదవుతుంటాయని వాటిలో వ్యవసాయ మోటార్లు, సోలార్ ప్యానెల్ దొంగతనాలు ఎక్కువగా జరుగుతున్నాయని తెలిపారు. వాటిని అరికట్టేందుకు చర్యలు తీసుకుంటున్నామని నేరాలకు పాల్పడిన వారిని పట్టుకునేందుకు కృషి చేస్తున్నామన్నారు. ఇటీవల కాలంలో చిన్నారులు, మహిళల మిస్సింగ్ కేసులు, ఎస్సీ, ఎస్టీ కేసులు, పోక్సో కేసులు చోటు చేసుకుంటున్న దృష్ట్యా వాటి నివారణకు చర్యలు తీసుకోవడంతో పాటు నేరస్తులకు కోర్టులో శిక్ష పడే విధంగా చర్యలు చేపడుతున్నామన్నారు. స్థానికంగా గతంలో పలు గంజాయి కేసులు నమోదయ్యాయని వాటిపై దృష్టి సారించామని అటువంటి కేసులు చోటు చేసుకోకుండా చూస్తున్నామని, ఇటీవల ఐజీ ఆధ్వర్యంలో డ్రగ్స్‌కు సంబంధించి కేసులు నమోదవుతున్నాయని వాటిపై ప్రత్యేక దృష్టి సారిస్తున్నట్లు తెలిపారు. అంతే కాకుండా భూ సమస్యలు ఎక్కువవుతున్నాయని వాటిని కూడా జరగకుండా చర్యలు తీసుకుంటున్నామన్నారు. చీరాల డివిజన్‌లోని అన్ని సర్కిల్స్ పరిధిలో నేర నియంత్రణ కోసం పకడ్బందీగా చర్యలు తీసుకుంటున్నట్లు వివరించారు. ముఖ్యంగా ఇటీవల కాలంలో రోడ్డు ప్రమాదాలు తరచూ చోటు చేసుకుంటున్న దృష్ట్యా వాటి నివారణ కోసం సిబ్బందిని అప్రమత్తం చేసి ప్రమాదాల నివారణకు ఎన్ని రకాలుగా చర్యలు తీసుకోవాలో అన్ని రకాలుగా తాము కృషి చేసి వాటిని తగ్గించేందుకు తమ వంతు ప్రయత్నం చేయనున్నట్లు తెలిపారు. ఇంకొల్లు సర్కిల్ ఇన్‌స్పెక్టర్ వైవీ రమణయ్య, ఎస్ఐ శీలం రమేష్, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

నాగవరపమ్మకు ముక్కుపుడక సమర్పణ



ఈఓ శ్రీనివాసరావుకు బంగారు ముక్కుపుడక అందిస్తున్న దాత కుటుంబ సభ్యులు

వేటపాలెం: రామన్నపేట శివారులో పంట పొలాల్లో వేంచేసి ఉన్న కనక నాగవరపమ్మ అమ్మవారికి వేటపాలేనికి చెందిన విశ్రాంత మున్సిపల్ కమిషనర్ పాకనాటి బలరామి రెడ్డి బంగారు ముక్కుపుడగ బహూకరించినట్లు ఆలయ ఈఓ పోతిన శ్రీనివాసరావు ఆదివారం తెలిపారు. ముందుగా దాత కుటుంబ సభ్యులు అమ్మవారి పొంగళ్లు చెల్లించి మొక్కు తీర్చుకొన్నారు. ఈఓ మాట్లాడుతూ దాత కుటుంబానికి అమ్మవారి ఆశీస్సులు అందినందున రూ. 21 వేల విలువైన బంగారు ముక్కు పుడగ అందజేసినట్లు తెలిపారు. కుటుంబ సభ్యులు శివమ్మ, శ్రీనివాసరెడ్డి, సుబ్బారెడ్డి, నాగరాజి, నాగిరెడ్డి, కిరణ్మయి పాల్గొన్నారు.

ఐఎంఏ వైద్యుల క్రిస్మస్ వేడుకలు



క్రిస్మస్ వేడుకల్లో ఐఎంఏ వైద్యులు

చీరాల రూరల్: ఏసుక్రీస్తు లోకానికి వెలుగై ఉన్నాడని, ఆయన రాకతోనే సమస్త మానవాళి పాపాలకు విముక్తి కలిగిందని పలువురు వక్తలు పేర్కొన్నారు. స్థానిక ఇండియన్ మెడికల్ అసోసియేషన్ హాలులో ఆదివారం రాత్రి ఇండియన్ మెడికల్, డెంటల్ అసోసియేషన్ ఆధ్వర్యంలో క్రిస్మస్ వేడుకలు ఘనంగా నిర్వహించారు. ముందుగా పలువురు వక్తలు దేవుని వాక్య సందేశం అందించారు. క్రీస్తు జననం సమస్త మానవాళికి పర్వదినంగా వారు అభివర్ణించారు. ప్రభువైన యేసుక్రీస్తు మనపై ఏవిధమైన ప్రేమ, జాలి, కరుణ, దయ చూపాడో మనం కూడా ఇతరులపై అదేవిధమైన ప్రేమ, అనురాగాలు చూపాలని పేర్కొన్నారు. ప్రజలకు క్రిస్మస్ శుభాకాంక్షలు తెలియజేశారు. చీరాలలో సీనియర్ వైద్యులు డాక్టర్ డేవిడ్‌సన్ సాల్మన్ ప్రజలకు అందించిన వైద్య సేవలను గుర్తు చేసుకున్న ఐఎంఏ వైద్యులు ఆయనను ఘనంగా సత్కరించారు. వీనుల విందైన సంగీతాల మధ్య వైద్యుల బృందం దేవుని గీతాలు ఆలపించారు. అనంతరం వైద్యుల ఆనందోత్సాహాల మధ్య క్రిస్మస్ కేకును కట్‌చేశారు. క్రీస్తు రాకను కాంక్షిస్తూ భక్తి శ్రద్ధలతో క్యాండిల్ లైట్ సర్వీసు నిర్వహించి ప్రేమ విందు ఏర్పాటు చేశారు. ఐఎంఏ అధ్యక్ష, కార్యదర్శులు పి. శ్రీదేవి, పూర్వి శ్రీకాంత్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ క్రిస్మస్ వేడుకల్లో పట్టణంలోని మెడికల్ అండ్ డెంటల్ వైద్యులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

చిన్నారులకు బహుమతుల ప్రదానం



ప్రతిభ కనబరచిన చిన్నారులకు బహుమతులు అందిస్తున్న ఉపాధ్యాయుడు

పర్చూరు (చినగంజాం): ఇతిహాసాలైన రామాయణం, మహాభారతంలో ప్రావీణ్యం ప్రదర్శించిన 9 మంది చిన్నారులకు ప్రముఖ ఉపాధ్యాయులు బృందావనం లక్ష్మీనాథ్ బహుమతులను అందించారు. ఆదివారం స్థానిక వేణుగోపాల స్వామి ఆలయంలో నిత్యం నిర్వహించే యోగా తరగతుల అనంతరం జరిగిన కార్యక్రమంలో రామాయణం, మహాభారతం గురించి విద్యార్థులను పలు రకాల ప్రశ్నలను సంధించారు. అందులో ప్రతిభను కనబరచిన విద్యార్థులను అభినందించి బహుమతులను అందించారు. యోగా గురువు కఠారి సత్యనారాయణ, ఉపాధ్యాయులు కొసనా వెంకటేశ్వర్లు, అజయ్‌బాబు తదితరులు పాల్గొన్నారు.

ట్రాన్స్‌ఫార్మర్ నుంచి మంటలు

చీరాల: పట్టణంలోని ఒన్‌టౌన్ పోలీస్‌స్టేషన్ ఎదురుగా ఉన్న కాంప్లెక్స్‌కు విద్యుత్‌ను సరఫరా చేసే ట్రాన్స్ ఫార్మర్ నుంచి ఆదివారం మధ్యాహ్నం ఒక్కసారిగా మంటలు చెలరేగాయి. నిత్యం రద్దీగా ఉంటే ప్రధాన రహదారిలో మంటలు వ్యాపించడంతో వ్యాపారస్తులు అప్రతమత్తమై అగ్నిమాపక సిబ్బందికి సమాచారం అందించగా వారు ఆర్పివేశారు.

మాలల సింహగర్జనకు తరలిన నేతలు

చీరాల: ఎస్సీ వర్గీకరణను నిరసిస్తూ ఆదివారం గుంటూరు జిల్లా నల్లపాడులో ఎస్సీ, ఎస్టీ వర్గీకరణ వ్యతిరేక పోరాట సమితి ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న మాలల సింహగర్జనకు దళిత సంఘాల నాయకులు భారీగా తరలివెళ్లారు. చీరాల నుంచి 20 కార్లలో దళిత సంఘాల నాయకులు గుంటూరుకు తరలివెళ్లారు. దళిత సంఘాల నేతలు ముక్కోణం పార్కు కూడలిలోని భారత రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఎస్సీ వర్గీకరణ కేవలం ఒక పార్టీకి మేలు చేసేలా చేయించుకుంటున్నారని, అన్నదమ్ముల్లా కలిసి ఉండే వారి మధ్య రాజకీయంగా చిచ్చు పెట్టేందుకే వర్గీకరణ చేస్తున్నారన్నారు. 32 వార్డు కౌన్సిలర్ గొట్టిపాటి ఎబినేజర్, ఎం. గ్రెగోరీ, డి. శాస్త్రి, కె. బజ్జిబాబు, వై.మేరిబాబు, పి.రాజేష్, డి.బాబూరావు, శ్యామ్యూల్, కిషోర్ తదితరులున్నారు.

అద్దంకి రూరల్: మాలల సింహగర్జకు అద్దంకి నుంచి ఎస్సీ వర్గీకరణ వ్యతిరేక పోరాట సమితి సభ్యులు భారీగా తరలి వెళ్లారు. ఆదివారం ఉదయం స్థానిక అంబేడ్కర్ విగ్రహానికి జ్యోతి రమేష్‌బాబు, జ్యోతి చంద్రమౌళి పూల మాలలువేసి జైభీమ్ నినానాలు చేశారు. అనంతరం ఏర్పాటు చేసిన బస్సులో అద్దంకి, తిమ్మాయపాలెం, చక్రాయపాలెం, కొటికలపూడి, రెడ్డిపాలెం, వేలమూరిపాడు, నాగులపాడు, వెంపరాల నిడమానూరు తదితర గ్రామాల నుంచి వచ్చిన వారితో కలిసి వెళ్లారు.



చీరాల: గుంటూరుకు తరలివెళ్తున్న దళిత సంఘాల నాయకులు



అద్దంకి: జెండా ఊపి బస్సు ప్రారంభిస్తున్న పోరాట సమితి నాయకులు

